
# ఆద్యాత్మికం

## గీతా శోధన (7-వ భాగము)

రచన: భీమా శ్రీనివాస రావు;
హైదరాబాద్

గీతను - మన రాతగా , మన నిత్య ప్రయాణ మార్గదర్శిగా , మన భౌతిక జీవిత సమస్యల నివారిణిగా ఎలా మనం చూడాలో విశదీకరించి శోధించి ప్రశ్నించుకొని చూసే ప్రయత్నం చేస్తున్నాం. ఈనాడు మరికొన్ని విషయాలు గీతాభిముఖంగా తెలుసుకొనే ప్రయత్నం చేద్దాం.

మనము ఎప్పుడు ఒక పని చేయుటకు అంగీకరించవలెను లేక నిరాకరించవలెను. ఒక్కోసారి నిరాకరించిన దానిని తిరిగి ఏ పరిస్థితులలో మనం చేయవలసి వస్తుంది?




ముందుగా చెప్పుకొన్నట్లు మనం ఒక ఆధ్యాత్మిక, ధార్మిక జీవన , సద్గుణ సంపన్నలేక గురు సమానమైన వ్యక్తితో సత్సాంగత్యపు ప్రయాణం మొదలు పెట్టి మనలోని మానసిక వ్యధకు కారణములైన అనేక సమస్యలకు మూలం వెతికి వాటినుండి బయటపడిన వెంటనే మన మరుసటి ఆలోచనా విధానం మారి పోతుంది. భౌతికపరమైన విషయ వాంఛలు ( కోరికలు ), భౌతిక సుఖాన్ని , భౌతిక లాభాన్ని ఇచ్చే అనేక నిత్య ప్రయాణ మార్గాలు మనకు అంతగా రుచించవు. అంటే వాటి నుండి మనం పూర్తిగా పక్కకు జరిగిపోయి, ఆధ్యాత్మిక ధ్యానం తప్ప లోకం తీరు ఏమీ పట్టని సన్యాసులు మాదిరిగా మారిపోతాం అని దీని అర్ధం కాదు. నిత్యం మనం సాగించే జీవితంపై ఒక స్పష్టమైన అవగాహన వస్తుంది. పట్టు మన చేతికి దక్కుతుంది. ఎందుకంటే ఏ మానసిక సమస్య నిన్ను దాటలేకపోతుంది కనుక. నిన్ను తన ఆధీనంలోకి తీసుకోలేకపోతుంది కనుక

అలాగే , అప్పటి వరకు మనకు సవ్యమనిపించి మనం చేస్తున్న అనేక పనులు మంచిది కాదు అని మనకు తోస్తుంది. ఎవరో వత్తిడి చేసి చెప్పాల్సిన అవసరం తగ్గిపోతుంది. దానితో మనలోని జ్ఞానం ( స్వతహాగా నేర్చుకొన్నది , మనిషిగా మనకు

ఉన్నది ) ప్రకాశించటం మొదలవుతుంది. ఆ జ్ఞానం , ఏదైనా ఒక పని చేయాలా వద్దా అన్నది , చేస్తే కలిగే శుభ , అశుభ ఫలితాలను మన కళ్ళ ముందు ఉంచుతుంది. అప్పటికే గురుబోధ , సత్సాంగత్యం ద్వారా ఇంద్రియాల మీద పట్టు సాధించిన మనకు ఫలితాల విశ్లేషణ అతి సులభం అవుతుంది. అప్పుడే ఆ పని చేయటానికి నిరాకరించాలా లేదా అంగీకరించాలా అన్నది గోచరిస్తుంది. ఇది చాలా స్పష్టం. ఇప్పటికే జీవితంలో ఉన్నతమైన మార్గమున నడిచే వారు నిత్యం చేసే పని కేవలం ఇది మాత్రమే. వారి వారి జ్ఞానాన్ని నిత్యం వృద్ధి చేసుకొంటూ , వారిని వారు పూర్తిగా నమ్మటం. కనుక ఏదైనా పనిచేసేటప్పుడు అది చేయుటకు అంగీకరించాలా లేదా నిరాకరించాలా అన్నది ఎవరికి వారు జ్ఞానంతో తీసుకొన్న స్వంత నిర్ణయమయితే ఫలితాల వల్ల వచ్చిన ఇబ్బంది ఎప్పుడూ ఉండనే ఉండదు.

అలాగే , ఒక్కోసారి మన మనసు చెప్పినట్లు కొన్ని పనులు చేయుటకు నిరాకరించి ఉండవచ్చు. వాటిని కూడా తిరిగి చేయవలసిన పరిస్థితి ఎప్పుడు వస్తుందంటే , '' ఎవరు '' మనల్ని ఆ పని చేయమన్నారు అనే దానిపై ఆధారపడి ఉంటుంది. ఆ పని చేయమన్న వ్యక్తి యొక్క పూర్వా పరాలు ఏమిటి అన్నదానిపై కూడా ఆధారపడి నిర్ణయం తీసుకోవాలి. దీనిని ఒక చిన్న శాస్త్ర బోధిత విషయం ద్వారా చూసే ప్రయత్నం చేద్దాం. అప్పటి వరకు యుద్ధం చేయాలనే తలంపుతో రణభూమిలో అడుగుపెట్టిన అర్జునుడు, ఎదురుగా ఉన్న తన వంశీకులను, మిత్రులను , గురువులను మొదలగు వారిని చూసిన పిమ్మట " న యోత్స్య ఇతి గోవిందా '' అన్నాడు. అంటే ఓ కృష్ణా '' నేను ఈ యుద్ధం చేయను '' అని తేల్చి చెప్పేశాడు. అప్పటి వరకు అతను నేర్చుకొన్న జ్ఞానంతో ఆలోచించి జరుగబోయే ప్రమాదాలను, నష్టాలను , వచ్చే సుఖ - దుఃఖాలను ఊహించి నేను ఈ యుద్ధం చేయను అని తన గాండీవాన్ని జారవిడిచి రథంలో కుప్పకూలిపోయాడు. ముందు మనం మాట్లాడుకొన్నట్లు , అతని పూర్తి స్వంత జ్ఞానంతో చేసిన ఇదే సరైన నిర్ణయము. అందరూ అంగీకరించి తీరవలెను.

కానీ సరిగ్గా అదే సమయమున , తన స్నేహితుడు , సన్నిహితుడు , తన రథసారధి అయిన స్వయం కృష్ణ భగవానుడు, లేదు అర్జునా .. '' నీవు యుద్ధము చేసి తీరవలెను" అని ఆదేశించెను, యుద్ధము చేయుటకు తగు కారణములను సవివరంగా వివరించెను. అంతట , అర్జునుడిని లేచి నిలబడి యుద్ధము చేసేలా చేసెను. అర్జునుడు కూడా ముందు తీసుకొన్న నిర్ణయాన్ని కాదని మరలా యుద్ధము చేయుటకు ముందుకు వచ్చెను. అంటే మనకు ఇక్కడ బోధపడవలసిన విషయం ఏమిటంటే...

తానూ నేర్చుకొన్న పరిజ్ఞానము కన్నా, తన ఆలోచనల కన్నా '' మిన్న గుణములు '' కలిగిన ఏ వ్యక్తి ( గురువు , స్నేహితుడు మొ // వారు ) అయినా మనం నిరాకరించిన పని చెయ్యమన్నా , అంగీకరించిన పని వద్దన్నా తప్పక వారి మాట విని మన ఆలోచన

మార్చుకొనవలెను. వారు ఎంతో ముందుచూపుతో మాత్రమే మనకు ఆ కార్యము చేయాలా వద్దా అనేది నిర్ణయిస్తారు అనేది నమ్మాల్సిన సత్యం. దానికన్నా ముందు ఆ '' మిన్న గుణములు '' కలిగిన వ్యక్తిని నీవు ఎంపిక చేసుకొనటంలో కూడా నీ పూర్తి పరిజ్ఞానాన్ని ఉపయోగించవలెను. అప్పుడే చేసిన కార్యము యొక్క ఫలితములు శుభాన్ని , సుఖాన్ని ఇస్తాయి. అందుకే మన చుట్టూ ఉండే మిత్రులను , సలహాలు , సంప్రదింపులు చేసే వ్యక్తుల ఎంపిక తగిన ఆలోచన , జాగ్రత్తతో కూడినది అయి ఉండవలెను. లేదంటే అసలు మన ఉనికికే ప్రమాదం ఏర్పడే పరిస్థితి వస్తుంది. భౌతికంగా ఆలోచిస్తే , మీరు నేటి సమాజంలో కూడా జాగ్రత్తగా గమనించండి, మన కలిగే సుఖము - దుఃఖము అనేవి కేవలం మన ఆలోచనలు మరియు మన చుట్టూ ఉండే మనుషుల మీదనే ఆధారపడి ఉంటాయి. అందుకే వారి ఎంపిక ఎప్పుడూ కూడా అర్జునిని మాదిరిగానే ఉండవలెను. కానీ అందరికీ స్వయం భగవానుడు శ్రీ కృష్ణుడు లాంటి మిత్రులు , గుణవంతులు దొరకక పోయినా ప్రయత్నిస్తే తప్పక ఒక సత్పురుషుడు దొరుకుతాడు. ఇంకెందుకు ఆలస్యం వెంటనే ఆ పనిలో ఉండండి.



ఇలాంటి మరిన్ని విషయాలు వచ్చే సంచికలో తెలుసుకొందాం....

ఇది నా స్వీయ రచన అని హామీ ఇస్తున్నాను.

